సాక్షి ములుగు

గురువారం । 14 । సెప్టెంబర్ । 2023



సోనియాగాంధీ సభకు లక్షలాదిగా తరలాలి

తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ సభకు ప్రజలు లక్షలాదిగా తరలిరావాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. - 8లో▸



8 నిమిషాల్లోనే చోరీ..!

ఈ నెల 4న వరంగల్‌లోని అపార్ట్‌మెంట్లలో చోరీలకు పాల్పడిన ముఠాను పోలీసులు అరెస్ట్ చేసి సొత్తు స్వాధీనం చేసుకున్నారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం

30.0° /24.0°

వాతావరణం

జిల్లాలో వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు మామూలుగా ఉంటాయి. సాయంత్రం చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

మండల ఏర్పాటుపై ట్విట్టర్‌లో సమాచారం

ములుగు రూరల్: మల్లంపల్లి మండల ఏర్పాటుపై ప్రజలు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌కు ట్విట్టర్‌లో తమ ఆకాంక్షను తెలియజేయాలని జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం మల్లంపల్లి మండల సాధన కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉద్యోగులు, యువత, మేధావులు ట్విట్టర్ వేదికన కేటీఆర్‌కు సమాచారం పంపించారు. ట్విట్టర్‌లో 2018 ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ, ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సత్యవతి రాథోడ్, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఇచ్చిన హామీలతో పాటు జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్ మృతి చెందిన సమయంలో కేటీఆర్ జెడీ మల్లంపల్లి మండలంగా ప్రకటిస్తామని ఇచ్చిన హామీని ట్విట్టర్‌లో పొందుపరిచారు. లేని పక్షంలో తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో మల్లంపల్లి మండలం సాధించే వరకూ పోరాటాలు చేపడుతామని హెచ్చరించారు.

'డబుల్' ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలి



ములుగు: జిల్లా కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్లను పూర్తి చేసి అర్హులైన వారికి కేటాయించాలని డిమాండ్ చేస్తూ డబుల్ బెడ్ రూం ఇళ్ల ములుగు పట్టణ సాధన సమితి సభ్యులు, ప్రజాసంఘాల జేఏసీ అధ్యక్షుడు ముంజాల భిక్షపతిగౌడ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్ల ఎదుట బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా భిక్షపతిగౌడ్ మాట్లాడుతూ 95 ఇళ్లు మంజూరైనా ఇప్పటి వరకు ఏ ఒక్కరికీ కేటాయించలేదన్నారు. నిరుపేద కుటుంబాలకు చెందిన పేదలు పట్టణంలో కిరాయి ఇళ్లలో ఉంటూ అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నూతనంగా మరో 1,000 ఇళ్లను జిల్లా కేంద్రానికి మంజూరు చేయాలని కోరారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు బొంపెల్లి ఝాన్సీ, గద్దల లక్ష్మి, మహ్మద్ మున్నీ, ములుగోజు రత్న, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం



భూపాలపల్లి రూరల్: చిరుధాన్యాల వంటకాలతో ఆరోగ్యం లభిస్తుందని కృషి విజ్ఞాన కేంద్రం, గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ అరుణ జ్యోతి అన్నారు. పీవీ.నరసింహారావు పశు వైద్య విద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం, మామునూరు వారి ఆధ్వర్యంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా, వేశాలపల్లి గ్రామంలో మహిళలకు చిరుధాన్యాలతో ఆహారపు వంటకాల పోటీని నిర్వహించారు. విజేతలకు శాస్త్రవేత్త డాక్టర్ అరుణ జ్యోతి బహుమతులు అందించారు. 9 రకాల చిరుధాన్యాలతో చేసిన 15 రకాల పిండి వంటలను ప్రదర్శించారు. జిల్లా వ్యవసాయ అధికారి విజయభాస్కర్ మాట్లాడుతూ.. చిరుధాన్యాల సాగుకు రైతులకు వ్యవసాయ శాఖ సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి సంజీవరావు, సీపీఓ సామ్యూల్ గ్రామస్తులు గణేశ్, గ్రామ పెద్దలు సాంబయ్య పాల్గొన్నారు.

రేపు వైద్య కళాశాల ప్రారంభం

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ భవేశ్‌మిశ్రా అన్నారు. జిల్లాలో నిర్మిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాలను బుధవారం ఆయన స్థానిక ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డితో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో వంద ఎంబీబీఎస్ సీట్లతో ఏర్పాటు చేసిన వైద్య కళాశాలను సెప్టెంబర్ 15న సీఎం కేసీఆర్ చేతుల మీదుగా వర్చువల్‌గా ప్రారంభించనున్నట్లు తెలిపారు. 5 ఎకరాల్లో అన్ని వసతులతో కూడిన ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ.. వైద్య కళాశాల ప్రారంభం సందర్భంగా పట్టణంలోని హనుమాన్ ఆలయం నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్, మున్సిపల్ చైర్‌పర్సన్, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.. ఇందులో జిల్లా నలుమూలల నుంచి ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు పాల్గొనాలని ఎమ్మెల్యే కోరారు.

జ్వరం.. కలవరం

భారీగా నమోదు అవుతున్న కేసులు

- డెంగీ, మలేరియా, టైఫాయిడ్‌తో జనం బెంబేలు
- కిటకిటలాడుతున్న ఏరియా, ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రులు
- డెంగీతో ఇప్పటికే ఐదుగురి మృత్యువాత
- గ్రామాల్లో శిబిరాలు నిర్వహిస్తున్న వైద్యశాఖ
- వరుస వర్షాలతో ప్రబలుతున్న జ్వరాలు



ఈ ఫొటోలోని మహిళ పేరు సరళ. మంగపేట మండలం కమలాపురం. ఇటీవల జ్వరం రావడంతో ఏటూరు నాగారంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మూడు రోజులుగా చికిత్స పొందుతోంది. ఇప్పటికే రూ.10వేల వరకు ఖర్చు వచ్చింది. జ్వరంతో నీరసంగా ఉండడంతో సెలైన్ బాటిల్స్ ఎక్కుతున్నాయి. జ్వరం తగ్గే వరకు ఇక్కడే ఉండాల్సిన పరిస్థితి.

సాక్షి విజిట్

ములుగు: ములుగు ఏజెన్సీ జ్వరాలతో వణికిపోతోంది. ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలతో నీళ్లు కాలుష్యమై ప్రజలు డయేరియా బారిన పడుతున్నారు. దీనికి తోడు డెంగీ, మలేరియా, వైరల్ జ్వరాలు భారీగా వ్యాప్తి చెందుతున్నాయి. చికిత్స తీసుకోవడానికి ప్రజలు ఆస్పత్రులను ఆశ్రయిస్తుండడంతో ములుగు ఏరియా ఆస్పత్రితో పాటు ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కిక్కిరిసి పోతున్నాయి. వైద్యమో మహాప్రభో అంటూ మొత్తుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. 15 రోజుల్లో 15 మంది మృత్యువాత పడడమే ఇందుకు నిదర్శనం. డబ్బులు ఉన్న వారు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తుండగా నిరుపేదలు ప్రభుత్వ ఆస్పత్రుల వైపు చూస్తున్నారు.

ఖాళీ బెడ్లు లేవు

జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రికి రోజుకు 500మందికి పైగా జ్వరపీడితులు ఓపీకి వస్తున్నారు. ఇందులో బుధవారం ఒక్కరోజే 40 మంది అడ్మిట్ కావడానికి వచ్చారు. ఇందులో కొంతమంది అప్పటికప్పుడే చికిత్స తీసుకుని ఇంటికి వెళ్తున్నారు. సరిపడా బెడ్లు లేకపోవడంతో క్యాజువాలిటీ, ఫీవర్ వార్డులో ఒక్కో బెడ్‌పై ఇద్దరిని ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఎక్కువ మంది వైరల్ ఫీవర్‌తో వచ్చి నాలుగు రోజులుగా వైద్యం తీసుకుంటున్నారు. పరిస్థితి మరీ సీరియస్‌గా ఉంటే వారిని వరంగల్ ఎంజీఎంకు తరలిస్తున్నారు. ఇక ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రిలో జ్వర పీడితులు క్యూలైన్లలో కిటకిటలాడుతున్నారు. నాలుగు



జ్వరపీడితులతో కిక్కిరిసిన ఏరియా ఆస్పత్రిలోని ఫీవర్ వార్డు



ఒకే బెడ్‌పై చికిత్స తీసుకుంటున్న జ్వరపీడితులు



ఏటూరునాగారం ఆస్పత్రిలో ఓపీ కోసం చూస్తూ..

రోజుల్లో 877 మంది ఓపీకి హాజరుకావడం గమనార్హం. ఏటూరునాగారం, మంగపేట, కన్నాయిగూడెం, వాజేడు, వెంకటాపురం(కె) మండలాల్లో ప్రభుత్వ ఆస్పత్రుల కన్నా ప్రైవేట్ క్లినిక్‌లలో ఎక్కువ మంది కనిపిస్తున్నారు. ములుగు జిల్లా కేంద్రంలోని ఇదే పరిస్థితి నెలకొంది. కన్నాయిగూడెం మండలంలోని పీహెచ్‌సీలో నాలుగు బెడ్లు మాత్రమే ఉన్నాయి. ప్రైవేట్ క్లినిక్‌లలో ఆరోగ్య పరిస్థితి విషమించే వరకు చెప్పడం లేదు. పీకల దాకా వచ్చాక వరంగల్‌కు రెఫర్ చేస్తున్నారని తెలుస్తోంది. మంగపేటతో పాటు చుంచుపల్లి పీహెచ్‌సీలలో జ్వర పీడితుల సంఖ్య రెట్టింపుగా ఉంది. బుధవారం మంగపేటలో 140 మంది, చుంచుపల్లిలో పీహెచ్‌సీలో 92 మంది ఓపీకి హాజరయ్యారు.

జిల్లాలోని ఆస్పత్రులకు వచ్చిన రోగుల వివరాలు

ములుగు ఏరియా ఆస్పత్రి (గత మూడు రోజుల్లో)	
సాధారణ జ్వరాలు	300
డెంగీ	10
వైరల్	152
మలేరియా	40
ఇన్ పేషెంట్లు	490
అవుట్ పేషెంట్లు	1,600
ఏటూరునాగారం ఆస్పత్రి	
సాధారణ జ్వరాలు	205
డెంగీ	30
మలేరియా	5
వైరల్	205
ఓపీ	877

15 రోజుల్లో

జిల్లాలో ఇప్పటి వరకు మరణాలు : 15

మూడు రోజులుగా చికిత్స పొందుతున్నా..



జ్వరం రావడంతో ఏరియా ఆస్పత్రికి వచ్చాను. వైద్యులు పరీక్షలు చేసి మూడు రోజుల పాటు చికిత్స అందిస్తున్నారు. వైరల్ ఫీవర్ అని చెప్పారు. ఒంట్లో నీరసంగా ఉంది. త్వరగా కోలుకొని ఇంటికి వెళ్లాలని అనుకుంటున్నా. పొద్దున, సాయంత్రం గ్లూకోజ్ ఇస్తున్నారు.

- నేత సమ్మక్క, ములుగు

రోగులకు మెరుగైన వైద్యం అందిస్తున్నాం..



జ్వరంతో బాధపడుతూ ఆస్పత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నాం. ప్రత్యేక ఫీవర్ వార్డు, ఎమర్జెన్సీలో ఒక వైద్యుడిని నియమించాం. వారం నుంచి జ్వరపీడితుల సంఖ్య పెరుగుతోంది. ఎప్పటికప్పుడు టెస్టులు నిర్వహించి నివేదిక ఆధారంగా చికిత్స అందిస్తున్నాం.

- జగదీశ్, సూపరింటెండెంట్, ఏరియా ఆస్పత్రి

గణేశ్ మండపాలకు తాత్కాలిక విద్యుత్ సరఫరా

ఏటూరునాగారం: వినాయక చవితి నేపథ్యంలో ఈ నెల 18 నుంచి జిల్లా వ్యాప్తంగా మండపాలను నెలకొల్పుతున్న దృష్ట్యా నిర్వాహకులు విద్యుత్ సరఫరా కోసం దరఖాస్తులు చేసుకోవాలని విద్యుత్‌శాఖ డీఈ నాగేశ్వర్‌రావు, ఏడీఈ సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాత్కాలిక విద్యుత్ సరఫరాకు విధి విధానాలను ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. గణేశ్ మండపాలకు దగ్గరగా ఉన్న ఎల్‌టీ లైన్ నుంచి నేరుగా విద్యుత్ సరఫరా చేస్తే ప్రైవేట్ ఎలక్ట్రీషియన్లు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. మండపాల నిర్వాహకులు అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) ఆఫీసులో దరఖాస్తు చేసుకొని పదిరోజులకు లోడు ఆధారంగా డబ్బులు చెల్లించి విద్యుత్ సరఫరా పొందాలని సూచించారు. 1.0 కిలో వాట్ వరకు రూ. 1,560, 1.5 వరకు రూ. 2,300, 2.0వరకు రూ.3,020, 2.0 కిలోవాట్ పైనుంచి రూ.3,020లతో పాటుకు నగదు చెల్లించి అనుమతితో విద్యుత్ సరఫరాను పొందాలని కోరారు. మరింత సమాచారం కోసం 8374025075 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలి



ములుగు రూరల్: ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని జేఏసీ అధ్యక్షుడు జాటోత్ జగన్ అన్నారు. మండల పరిధిలోని జాకారం గురుకుల పాఠశాలలో బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులతో పాటు విధులు నిర్వహిస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు రజిత, స్వామి, సుదర్శన్, కృష్ణ, దినేష్, రవి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ జీపీలకు అవార్డుల ప్రదానం



సర్పంచ్, ఎంపీఓకు అవార్డు, ప్రశంస పత్రాన్ని అందిస్తున్న అదనపు కలెక్టర్ వెంకన్న



ఏటూరునాగారం సర్పంచ్, కార్యదర్శులను సన్మానిస్తున్న అధికారులు

ములుగు: స్వచ్ఛ భారత్ మిషన్, స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ 2023 కు ఎంపికైన 16 ఉత్తమ గ్రామ పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులను బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ డీఎస్.వెంకన్న, ఇతర అధికారులు అవార్డులు, ప్రశంస పత్రాలను బుధవారం అందజేసి వారిని శాలువాలతో సన్మానించారు. కేంద్ర ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయించగా రెండు వేల లోపు జనాభా ఉన్న కన్నాయిగూడెం మండలంలోని ఏటూరు, మంగపేట మండలంలో ఏకే మల్లారం, ములుగు మండలంలోని భూపాల్‌నగర్, మహ్మద్‌గౌస్‌పల్లి, వెంకటాపురం(ఎం) మండలంలోని నర్సాపురం, 5వేల లోపు జనాభా ఉన్న ములుగు మండలంలోని పత్తిపల్లి, జంగాలపల్లి, వెంకటాపురం(కె) మండలంలోని సూరవీడు, వెంకటాపురం(ఎం), వాజేడు మండలంలోని మొరుమూరు, ఏటూరునాగారం మండలంలోని ఏటూరునాగారం, గోవిందరావుపేట మండలంలోని చల్వాయి, మంగపేట మండలంలోని కమలాపురం, ఎస్ఎస్ తాడ్వాయి గ్రామాలు ఉత్తమ జీపీలుగా ఎంపికయ్యాయి. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో వ్యక్తిగత మరుగుదొడ్లు, సోక్‌పిట్లు, డ్రెయినేజీలు, పారిశుద్ధ్యం నిర్వహణ, వంటి వాటిలో పనితీరు బాగున్న గ్రామపంచాయతీలకు సర్టిఫికెట్లు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ నాగపద్మజ, జెడ్పీ సీఈఓ ప్రసూనా రాణి, డీపీఓ వెంకయ్య, జెడ్పీటీసీ తుమ్మల హరిబాబు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పాత్ర కీలకం

ములుగు రూరల్: సమాజాన్ని మేల్కొల్పడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని జిల్లా ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ డీఎస్.వెంకన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని సంక్షేమ భవన్‌లో కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. అనంతరం డీఈఓ పాణిని మాట్లాడుతూ కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవాన్ని పురస్కరించుకొని ఉపాధ్యాయులను సన్మానించడం గర్వించదగిన విషయమన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని 60 మంది ఉపాధ్యాయులను సన్మానించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎండి.సర్వర్, సదయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ఉత్తమ అవార్డు అందుకుంటున్న నర్సాపూర్ ఎంపీపీఎస్ ఉపాధ్యాయుడు సందీప్

కులవృత్తులకు అండగా ప్రభుత్వం

ములుగు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం కులవృత్తులకు అండగా నిలుస్తుందని జెడ్పీ చైర్ పర్సన్ బడే నాగజ్యోతి అన్నారు. మండల పరిధిలోని బరిగలానిపల్లిలో గొల్లకురుమలకు రెండో విడత గొర్రెలను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా పథకాలను ప్రవేశపెడుతున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ఆదరించి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇంచర్ల సర్పంచ్ రాజయ్య, పీఏసీఎస్ చైర్మన్ రాములు, మస్రగాని వినయ్‌కుమార్, సుధారాణి, అశోక్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జంగాలపల్లి గ్రామానికి చెందిన నాగెల్లి బుచ్చమ్మ, చింతల నిర్మల, పెండల రాజనర్సు, ముసినపల్లి రవిలు ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాలను నాగజ్యోతి పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.



బరిగలానిపల్లిలో గొర్రెలు పంపిణీ చేస్తున్న నాగజ్యోతి

'టెట్'ను పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగు: రేపు జరగనున్న టెట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌ను బుధవారం కలెక్టర్ తనిఖీ చేశారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా అధికారులు చూడాలన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి పేపర్, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు రెండో పేపర్ ఉంటుందని తెలిపారు. జిల్లాలోని తెలంగాణ మోడల్ స్కూల్ బండారుపల్లి, జవహర్‌నగర్, చల్వాయి, ములుగు ప్రభుత్వ జూనియర్ కళాశాల, జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, స్టేట్ రెసిడెన్షియల్ స్కూల్ బండారుపల్లి, పస్రా, గోవిందరావుపేట, జెడ్పీహెచ్ఎస్‌లలో కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొదటి పేపర్‌కు 1,692 మంది, రెండో పేపర్‌కు 1,295 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. విద్యాశాఖ కార్యాలయంలో సందేహాల నివృత్తికి ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతీ కేంద్రంలో వైద్యుడు, ఇతర సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. రెండు రూట్‌లను ఏర్పాటు చేసి అధికారులకు విధులు కేటాయించామని, వాహనాలను సమకూర్చాలని ఆర్టీఏ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పరీక్షలు రాసే అభ్యర్థులు సూచనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. విద్యార్థులు ఓఎంఆర్ షీట్ బబుల్స్ నింపడానికి కేవలం బ్లాక్ రిఫిల్ పెన్నులను మాత్రమే వినియోగించాలని, ఇంకు పెన్నులు నిషేధం అన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని వివరించారు. నిమిషం ఆలస్యమైన అనుమతి ఉండదని తెలిపారు. చివరి సమయంలో హాల్ టికెట్ లేకపోతే హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకొని ఫొటో, గెజిటెడ్ అధికారి ధృవీకరణ తీసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ డీఎస్ వెంకన్న, డీఈఓ పాణిని, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకన్న, అసిస్టెంట్ కమిషనర్ ఫర్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్ అప్పని జయదేవ్ తదితరులు ఉన్నారు.



ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి



గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

తీర్మానం అందిస్తే తరలింపునకు చర్యలు

ములుగు రూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ప్రాజెక్టునగర్ గ్రామం పూర్తిగా వరద ముంపునకు గురి కావడంతో పాటు వరదల్లో ముగ్గురు వ్యక్తులు మృతి చెందారని గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠిని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు బుధవారం ప్రాజెక్టునగర్‌లో అటవీశాఖ జిల్లా అధికారి రాహుల్ కిషన్‌జాదవ్‌తో కలిసి గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామస్తులంతా కలిసి గ్రామం తరలింపు విషయంపై ఏకగ్రీవ తీర్మానం అందించాలన్నారు. ఎగువ ప్రాంతాలనికి తరలించేందుకు అనుమతులు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ నాగపద్మజ, డీపీఓ వెంకయ్య, ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీఓ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.


చదువుకు దూరమవుతున్న విద్యార్థులు

ఏటూరునాగారం: ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గొప్ప సమ్మారావు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన విద్యకు దూరమవుతున్న విద్యార్థులపై పట్టింపులేని డీడీ హడావుడిగా అసంబద్ధమైన డిప్యూటేషన్లు ఇచ్చి చేతులు దులుపుకున్నారని తెలిపారు. బొమ్మాయిగూడెంలో పనిచేస్తున్న టీచర్‌ను ఐలాపూర్‌కు, రాంపూర్‌లో పనిచేస్తున్న టీచర్‌ను బొమ్మాయిగూడానికి మార్చాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. టీచర్లు లేని చోటుకు సర్దుబాటు చేయాల్సింది పోయి ఇలా మార్చడం సరికాదన్నారు. ఐలాపూర్‌లో ఉన్న 50 మంది పిల్లలకు ముగ్గురు ఉపాధ్యాయులు ఉంటే అక్కడికి మరో ఉపాధ్యాయుడిని పంపాల్సిన అవసరం ఏముందన్నారు. తాడ్వాయి మండలం నుంచి ఒక మహిళా టీచర్‌ను శంకరాజుపల్లికి ఎందుకు బదిలీ చేశారని మండిపడ్డారు. చిన్నబోయినపల్లి ఏహెచ్ఎస్‌లో ఇద్దరిని వేరే చోటికి పంపించి మరొకరిని అక్కడికి ఎందుకు పంపించారన్నారు. టీచర్స్ లేని పాఠశాలలకు ఉపాధ్యాయులు కావాలని అడిగితే ఆదివాసులపై కేసులు పెట్టే అధికారులు, అక్రమ, వ్యక్తిగత డిప్యూటేషన్లు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఈ డిప్యూటేషన్లు సవరించి, అవసరం ఉన్నచోటకే ఉపాధ్యాయులను పంపించాలన్నారు.

సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులే

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు వీరయ్య

ములుగు రూరల్/వాజేడు: తెలంగాణ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులే అని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్.వీరయ్య అన్నారు. గోవిందరావుపేట మండల పరిధిలోని పస్రాలో బుధవారం నిర్వహించిన వార్షికోత్సవ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా పస్రాలో సీపీఎం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1946 నుంచి 1951 వరకు తెలంగాణలో వెట్టిచాకిరికి, భూస్వాములకు వ్యతిరేఖంగా చేపట్టిన తిరుగుబాటుకు కమ్యూనిస్టు నాయకులే నాయకత్వం వహించారని తెలిపారు. రాష్ట్రంలో నిరుపేదలకు 10 లక్షల ఎకరాల భూమిని పంచి పెట్టిన ఘనత కమ్యూనిస్టులదని వివరించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి పట్టాలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం వాజేడు మండల పరిధిలోని పూసూరు గ్రామ సమీపంలో మూడు రోజులుగా గుడిసెవాసులు చేస్తున్న పోరాట శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 65 కేంద్రాల్లో ఈ భూపోరాటం జరుగుతుందని తెలిపారు. నిరుపేదలకు గుడిసెలు దక్కే వరకూ ఎర్రజెండా అండగా ఉండి పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూడి కృష్ణారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి, తీగల ఆదిరెడ్డి, సాంబశివ, చిట్టిబాబు, రాజేష్, పోశాలు, సత్యనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీరయ్య

అంగన్‌వాడీలు పోరాడాలి

ఏటూరునాగారం: అంగన్‌వాడీ టీచర్లు సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు పోరాడాలని సీఐటీయూ రాష్ట్ర సీనియర్ నాయకులు వీరయ్య పిలుపునిచ్చారు. అంగన్‌వాడీ టీచర్లు తమను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ తదితర డిమాండ్లను పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె బుధవారం మూడో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా శిబిరాన్ని వీరయ్య సందర్శించి సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. సమస్యలు పరిష్కరించాలని పోరాడే సంఘాలను చర్చలకు పిలవకపోవటం అప్రజాస్వామికం అన్నారు. తక్షణమే ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యకాస జిల్లా కార్యదర్శి సాంబశివ, చిట్టిబాబు, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.సరోజ, జమున, సరిత, సూరమ్మ పాల్గొన్నారు.

వృద్ధురాలి కళ్లలో కారం చల్లి..

- మెడలోని రెండున్నర తులాల బంగారం అపహరణ
- ఉదయం 5గంటలకే కరీమాబాద్ కురుమవాడలో ఘటన
- ఘటనా స్థలిని సందర్శించిన సీఐ సురేష్, క్లూస్ టీం
- పోలీసుల అదుపులో అనుమానితురాలు..!



బాధితురాలు వినోదను పరామర్శిస్తున్న కార్పొరేటర్ మరుపల్లి రవి

ఖిలా వరంగల్: వరంగల్ నగరంలో దొంగలు రెచ్చిపోతున్నారు. ఓ ఘటన మరవక ముందే.. మరో చోట చోరీలు వెలుగులోకి వస్తున్నాయి. దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. తాజాగా ఉర్సు కరీమాబాద్ కురుమవాడలో చోరీ జరిగింది. స్థానికుల కథనం ప్రకారం మిల్స్‌కాలనీ పీఎస్ పరిధి కరీమాబాద్ కురుమ వీధిలో వృద్ధురాలు మజ్జిగ వినోద తన ఇంట్లో ఒంటరిగా ఉంటోంది. ఈ విషయం తెలిసిన ఓ గుర్తు తెలియని మహిళ బుధవారం ఉదయం 5గంటలకే వృద్ధురాలి ఇంటికి చేరుకుని తలుపు కొట్టింది. తలుపు తీయగానే సదరు మహిళ.. వృద్ధురాలి కళ్లలో కారం చల్లి క్షణాల్లో మెడలోని రెండున్నర తులాల బంగారు పుస్తెలు లాక్కొని పరారైంది.దీంతో వృద్ధురాలు లబోదిబోమంది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న మిల్స్‌కాలనీ సీఐ సురేష్, క్లూస్ టీం ఘటనా స్థలికి చేరుకుంది. చోరీ జరిగిన ఇంటిని పరిశీలించింది. అనంతరం వృద్ధురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానిత మహిళను విచారించిన పోలీసులు..!

కరీమాబాద్‌లో అనుమానాస్పదంగా కనిపించిన ఓ మహిళను బుధవారం మధ్యాహ్నం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. చోరీ జరిగిన ఇంటి సమీపంలోని సీసీ పుటేజీని పరిశీలించగా ఓ మహిళ రోడ్డుపై ఆందోళనగా వెళ్తున్నట్లు కనిపించింది. సదరు మహిళ గతంలో ఆ ఇంటి సమీపంలోనే అద్దెకు ఉన్నట్లు సమాచారం. రెండురోజుల క్రితం ఆ మహిళ.. వృద్ధురాలు వినోదను కలిసి ఇల్లు అద్దెకిస్తారా అంటూ అడిగి వెళ్లినట్లు తెలుస్తోంది. వీటిని పరిగణనలోకి తీసుకున్న పోలీసులు ఆ మహిళను అదుపులోకి తీసుకుని విచారించి వదిలేసినట్లు సమాచారం.

చింతల్‌లో బెల్ట్‌షాపులో చోరీ..

వరంగల్ చింతల్‌లో ఓ బెల్ట్‌షాపులో చోరీ జరిగింది. మంగళవారం రాత్రి 10గంటల బెల్ట్ షాపు గదికి తాళం వేసి ఇంటికి వెళ్లిన వ్యాపారి.. ఉదయం వచ్చి చూసే సరికే తాళం పగులగొట్టి ఉంది. షాపులోని ఐదు మద్యం ఫుల్ బాటిళ్లు, రూ.3వేల నగదు చోరీకి గురైంది. దీనిపై మిల్స్ కాలనీ పోలీసులను వివరణ కోరగా బాధితులు ఫిర్యాదు చేయలేదని తెలిపారు.



8 నిమిషాల్లోనే చోరీ..!

వరంగల్ నగరంలోని 9 అపార్ట్‌మెంట్లలో చోరీలకు పాల్పడిన ముఠా అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న సీపీ రంగనాథ్

- రూ.2 కోట్ల విలువైన బంగారం, వజ్రాలు స్వాధీనం
- రూ.5.20 లక్షల విలువైన 104 కిలోల గంజాయి పట్టివేత
- కారు, పిస్తోల్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీపీ రంగనాథ్

వరంగల్ క్రైం: చోరీల్లో ఆ ముఠా స్టైలే వేరు.. వీరిని చూస్తే ఎవరికీ అనుమానం కలుగదు. మొదట వాకీటాకీలో సంభాషించుకుంటారు. అనంతరం ప్రొఫెషనల్స్‌గా అపార్ట్‌మెంట్లలోకి ఎంట్రీ అవుతారు. ఈ సమయంలో వీరిని ఎవరైనా చూస్తే ఏ ప్రభుత్వ అధికారులో, లేక కార్పొరేట్ కంపెనీ అధికారులో అనుకుంటారు. ఇక్కడ ఏమైనా పని ఉందో.. అందుకే వచ్చారనుంటారు. ఇదే వీరికి కలిసిచ్చే అంశం . సాంకేతిక పరిజ్ఞానంతో క్షణాల్లో పకడ్బందీగా చోరీలు చేస్తారు. కేవలం 8 నిమిషాల్లోనే ఇల్లును గుల్ల చేసి దర్జాగా బయటకు వస్తారు.. ఇలా వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని మూడు పోలీస్‌స్టేషన్ల పరిధిలో 9 అపార్ట్‌మెంట్లలో చోరీలకు పాల్పడిన అంతర్ రాష్ట్ర ముఠాను అరెస్టు చేసినట్లు సీపీ ఏ.వి రంగనాథ్ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.2 కోట్ల విలువైన సుమారు 2 కిలోల 380 గ్రాముల బంగారం, వజ్రా ఆభరణాలు, రూ.5.20 లక్షల విలువైన 104 కిలోల గంజాయితో పాటు ఒక పిస్తోల్, 5 రౌండ్లు, కారు, నాలుగు సెల్‌ఫోన్లు, రెండు వాకీటాకీలు, నాలుగు నకిలీ ఆధార్ కార్డులు, రూ.5 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం మధ్యాహ్నం కమిషనరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

వరుస చోరీలు..

ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం ఘజియాబాద్‌కు చెందిన అక్బర్ ఖురేషీ, మీరట్ జిల్లాకు చెందిన కపిల్ జాటోవ్, ఘజియాబాద్‌కు చెందిన మహ్మద్ షరీఫ్, మహ్మద్ షహజాద్ ఖాన్.. ఈనెల 4వ తేదీన ఆదిలాబాద్, 5వ తేదీన వరంగల్ పోలీస్ కమిషనరేట్, 6వ తేదీన బెంగళూరులో వరుస చోరీలకు పాల్పడ్డారు. ఈనెల 5వ తేదీన వరంగల్ కమిషనరేట్‌లోని మట్టెవాడ, హనుమకొండ, సుబేదారి పోలీస్‌స్టేషన్ల పరిధిలో 9 అపార్ట్‌మెంట్లలో చోరీలకు పాల్పడ్డారు. దీంతో క్రైం డీసీపీ దాసరి మురళీధర్ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేసి ఆదిలాబాద్, బెంగళూరులో జరిగిన చోరీల తీరు కదలికలకు సంబంధించి సీసీ దృశ్యాలతో వివరాలు సేకరించి ఈ తరహా చోరీలు ఎక్కడెక్కడ జరిగాయే నిర్ధారించారు. ఇదే తరహాలో ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్‌లో మే 4వ తేదీన పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీలు జరగడంతో సీఐ శంకరయ్య సహకారంతో నిందితులను పట్టుకునేందుకు దర్యాప్తులో వేగం పెంచారు.

తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యం...

నిందితులు వ్యసనాలకు అలవాటు పడి తాళం వేసి ఉన్న ఇళ్లనే లక్ష్యం చేసుకుని చోరీలకు పాల్పడుతున్నారు. పలుమార్లు జైళ్లకు వెళ్లి బయటకు వచ్చారు. ఈ క్రమంలో ఢిల్లీలో కారు కొనుగోలు చేసి ఈనెల 3న ఢిల్లీ నుంచి బయలుదేరి 4న హైదరాబాద్, 5న మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో 03, హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో 04, సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలో 02 అపార్ట్‌మెంట్లలో చోరీలకు పాల్పడ్డారు. అదే కారులో బెంగళూరు వెళ్లి అక్కడ నాలుగు చోరీలకు పాల్పడ్డారు. అనంతరం తమ వద్ద ఉన్న డబ్బుతో గంజాయి కొనుగోలు చేసి విక్రయించేందుకు వరంగల్ మీదుగా ఢిల్లీకి వెళ్తున్నారు. ఈ క్రమంలో సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలోని తెలంగాణ జంక్షన్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా కారులో అనుమానాస్పదంగా కనిపించారు. ఆపే క్రమంలో తప్పించుకునేందుకు ప్రయత్నించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారు. ఈ ముఠా ఇప్పటి వరకు 16 చోరీలకు పాల్పడగా అందులో రెండు తెలుగు రాష్ట్రాలలో 10వరకు ఉన్నాయని సీపీ రంగనాథ్ వివరించారు.

అధికారులకు అభినందనలు..

నిందితులను సకాలంలో పట్టుకోవడంతో పాటు చోరీ సొత్తును రికవరీ చేయడంలో సహకరించిన కర్నూల్ జిల్లా ఎస్పీ కృష్ణకాంత్, కర్నూల్ ఫోర్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ శంకరయ్యకు సీపీ రంగనాథ్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. దీంతో పాటు డీసీపీ మురళీధర్, క్రైం ఏసీపీ మల్లయ్య, మట్టెవాడ, మహిళా పోలీస్‌స్టేషన్, సీసీఎస్, హన్మకొండ, సుబేదారి ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వర్లు, సూర్యప్రసాద్, శంకర్‌నాయక్, కరుణాకర్, షుకూర్, ఏఏఓ సల్మాన్ పాషా, ఎస్సైలు విఠల్, అనిల్, సంపత్‌కుమార్, రాజేందర్, బాబురావు, యాదగిరి, ఏఎస్సై తిరుపతి, హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్, ఇతర సిబ్బందిని సీపీ రంగనాథ్ అభినందించారు.

సోనియాగాంధీ సభకు లక్షలాదిగా తరలాలి



మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

తెలంగాణ రాష్ట్ర సాధనలో ఓరుగల్లుది కీలక పాత్ర

- నాయకులు, కార్యకర్తలు శక్తినంతా ప్రదర్శించాలి
- సీడబ్ల్యూసీ సమావేశాలు తెలంగాణలో జరగడం గర్వకారణం
- టీపీసీసీ అధ్యక్షుడు అనుముల రేవంత్ రెడ్డి



సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు

హన్మకొండ: తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ సభకు ప్రజలు లక్షలాదిగా తరలిరావాలని టీపీసీసీ అధ్యక్షుడు అనుముల రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం హనుమకొండ విద్యుత్‌నగర్‌లోని విష్ణుప్రియ గార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి అధ్యక్షతన వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో ఓరుగల్లుది కీలక పాత్ర అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రతి నియోజకవర్గం నుంచి ఇద్దరు నుంచి ముగ్గురు ఎమ్మెల్యే టికెట్ కోసం పోటీ పడుతున్నారని, వీరంత ప్రజలను తరలించేందుకు పోటీ పడాలన్నారు. కాంగ్రెస్ విజయభేరి సభను విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు శక్తినంతా ప్రదర్శించాలన్నారు. సీడబ్ల్యూసీ సమావేశాలు తెలంగాణలో జరగడం గర్వకారణమన్నారు. కాంగ్రెస్ బహిరంగ సభకు స్థలం ఇవ్వకుండా ప్రధాని మోదీ, సీఎం కేసీఆర్ కలిసి కుట్ర పన్నితే రంగారెడ్డి జిల్లా రైతులు తామున్నామంటూ ముందుకువచ్చి 200 ఎకరాల స్థలం ఇచ్చారన్నారు. ఆ రైతుల స్ఫూర్తిని కాకతీయ గడ్డ పౌరులు అర్థం చేసుకోవాలన్నారు. ఈ నెల 17న తుక్కుగూడలోని రాజీవ్ గాంధీ ప్రాంగణంలో విజయభేరి మోగించేందుకు కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ వస్తున్నారన్నారు. అమరుల తల్లుల కడుపుకోత గుర్తించి సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారన్నారు. సీఎం కేసీఆర్ తెలంగాణ ద్రోహి కాబట్టే సోనియా గాంధీ వస్తుంటే అడ్డుకుంటున్నారని విమర్శించారు. ఆంధ్రా వారితో సీఎం కేసీఆర్, కేటీఆర్ అంటకాగుతూ తన చిత్తశుద్ధిని శంకిస్తున్నారని, వీరు తన ఎడమకాలి చెప్పుకు సరిపోరని ధ్వజమెత్తారు. 'అమరవీరుల స్తూపం ప్రారంభించి వంద రోజులు కాకముందే పగుళ్లు పట్టాయని, ఆ స్తూపం కాంట్రాక్టు కూడా ఆంధ్రా వాళ్లకు ఇచ్చిన మీరా నా చిత్తశుద్ధిని శంకించేదని ప్రశ్నించారు.' మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను పక్కన పెట్టి మాయమాటలతో ప్రజలను వంచిస్తున్నారని, చివరకు విలేకరులకు కూడా మోసం చేశారన్నారు. తెలంగాణ వస్తే బతుకులు మారుతాయని భావించిన ప్రజలకు కేసీఆర్ చేసింది ఏమీ లేదని విమర్శించారు. కాంగ్రెస్ వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ రవీందర్ ఉత్తమరావు దళ్వి మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి భారీ ఎత్తున ప్రజలను తరలించాలని నాయకులకు సూచించారు. ఈ సమావేశంలో కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాం నాయక్, కాంగ్రెస్ వరంగల్, మహబూబాబాద్, జనగామ జిల్లాల అధ్యక్షులు ఎర్రబెల్లి స్వర్ణ, ఆయిత ప్రకాష్ రెడ్డి, కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, నాయకులు కొండా సురేఖ, సిరిసిల్ల రాజయ్య, కొండా మురళీధర్ రావు, సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ, వేం నరేందర్ రెడ్డి, కూచన రవళి, దొమ్మాటి సాంబయ్య, డాక్టర్ రియాజ్, తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

- భార్యకు ఉద్యోగం, రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి
- వివిధ కార్మిక సంఘాల నాయకుల డిమాండ్
- బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా

వరంగల్ అర్బన్ : విధుల్లో భాగంగా దోమల నివారణకు ఫాగింగ్ చేస్తూ మృతి చెందిన ఎర్ర రాజు భార్యకు ఉద్యోగం కల్పించి, రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని వివిధ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట మృతుడి కుటుంబీకులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుడు రాజు.. 60 డివిజన్‌లో ఓ ప్రైవేట్ అపార్ట్‌మెంట్‌లో ఫాగింగ్ చేస్తుండగా పొగ ముక్కులో చేరి ఊపిరాడక మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, సీఎంహెచ్‌వో రాజేష్‌తో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య, టీ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొట్ల భిక్షపతి, డీసీసీబీ మాజీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జంగా రాఘవరెడ్డి, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నాయిని రవి, తదితరులు చర్చల్లో పాల్గొన్నారు. పరిహారంపై మేయర్‌తో చర్చించి అందజేస్తామని, కార్మికుడి భార్య కు ఉద్యోగం కల్పిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు.

గుండెపోటుతో బల్దియా వాహన డ్రైవర్ మృతి..

ఖిలా వరంగల్‌కు చెందిన బల్దియా వాహన డ్రైవర్ జనార్దన్ బుధవారం బాలసముద్రంలో గుండెపోటుతో మృతి చెందారని కార్మిక సంఘాల నాయకులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. జనార్దన్ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

కేసు నమోదు

కాజీపేట: హనుమకొండ సర్కిల్‌లో మలేరియా విభాగంలో పని చేస్తూ అస్వస్థతకు గురై మృతి చెందిన ఎర్ర రాజు (40) భార్య లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు సీఐ సార్ల రాజు తెలిపారు. మంగళవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో ప్రణయ్‌భాస్కర్, ప్రశాంత్‌నగర్ కాలనీల సమీపంలో నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్స్ వద్ద దోమల నివారణ కోసం ఫాగింగ్ చేస్తుండగా పొగలో చిక్కుకుపోయి ఊపిరాడక తుదిశ్వాస విడిచినట్లు ఫిర్యాదులో పేర్కొంది. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సీఐ చెప్పారు.



కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాతో చర్చల్లో వివిధ కార్మిక సంఘాల నాయకులు

వీసీపై విచారణ కమిటీని నియమిస్తాం

- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

కేయూ క్యాంపస్ : వందరోజుల్లో తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, వెంటనే కాకతీయ యూనివర్సిటీ వీసీ రమేష్‌పై విచారణ కమిటీని నియమిస్తామని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. పీహెచ్‌డీ అడ్మిషన్ల అవకతవకలపై ఆందోళన చేస్తే పోలీసులతో తీవ్రంగా కొట్టించడం దారుణమని వీసీ, రిజిస్ట్రార్‌ల తీరుపై మండిపడ్డారు. కేయూలో కొనసాగుతున్న విద్యార్థి జేఏసీ నిరసన దీక్ష శిబిరాన్ని బుధవారం సాయంత్రం డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, ఇతర నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా గాయపడిన విద్యార్థులను పరామర్శించి మాట్లాడారు. ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డికి బ్రంటోతుగా మారిన వ్యక్తిని కేయూ వీసీగా నియమించారని విమర్శించారు. కేయూ, ఓయూ విద్యార్థుల పోరాటాలతోనే మీ కుటుంబానికి పదవులు వచ్చాయని కేసీఆర్‌పై మండిపడ్డారు. కేయూలో జరుగుతున్న అక్రమాలకు పల్లారాజేశ్వర్‌రెడ్డి కారణమన్నారు. వీసీ, రిజిస్ట్రార్లను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. దీక్షలు చేస్తున్న వారికి కాంగ్రెస్ అండగా ఉంటుందన్నారు.అనంతరం జ్యూస్ ఇచ్చి దీక్షలను విరమింపజేశారు. కేయూ విద్యార్థి జాక్ చైర్మన్ తిరుపతి యాదవ్, నాయకులు మేడ రంజిత్, మొగిలి వెంకటరెడ్డి, డాక్టర్ వలీఉల్లాఖాద్రి, బి నర్సింహారావు, డాక్టర్ మందవీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

క్వారీలో రాళ్లు మీదపడి కార్మికుడి దుర్మరణం



అమీర్‌పాషా(ఫైల్)

కేసముద్రం : ఓ క్వారీలో ఒక్కసారిగా 30 మీటర్ల ఎత్తు నుంచి రాళ్లు పడడంతో ఓ కార్మికుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం అర్పనపల్లి గ్రామ సమీపంలో జరిగింది. ఎస్సై తిరుపతి కథనం ప్రకారం అర్పనపల్లి– తీగలవేణి గ్రామాల మధ్య గల మిడ్‌వెస్ట్ గ్రానైట్స్ లిమిటెడ్ క్వారీలో అర్పనపల్లి గ్రామానికి చెందిన షేక్ అమీర్‌పాషా(55) 30 సంవత్సరాల నుంచి దినసరి కూలీగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం క్వారీలోపల బ్లాస్టింగ్ జరిపారు. ఆ తర్వాత అదే చోట అమీర్‌పాషా డ్రిల్లింగ్ చేస్తుండగా 30 మీటర్ల ఎత్తు నుంచి ఒక్కసారిగా రాళ్లు కూలి అతడి మీదపడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబీకులు, గ్రామస్తులు ఘటనా స్థలికి చేరుకున్నారు. క్వారీ నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగానే అమీర్‌పాషా మృతి చెందాడని, దీనిపై చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన చేపట్టారు. దీనిపై సమాచారం అందుకున్న మహబూబాబాద్ డీఎస్పీ సత్యనారాయణ, రూరల్ సీఐ రమేష్, కేసముద్రం ఎస్సై తిరుపతి, గూడూరు ఎస్సై రాణాప్రతాప్ ఘటనా స్థలికి చేరుకుని మృతదేహం, పరిసరాలను పరిశీలించారు. అనంతరం మహబూబాబాద్ ఆర్డీఓ అలివేలు క్వారీ వద్దకు చేరుకుని రికార్డులు పరిశీలించారు. క్వారీలో బ్లాస్టింగ్ జరపడానికి అనుమతులున్నాయా.. లేదా అనే విషయంపై విచారణ చేయిస్తామన్నారు. దీంతో బాధిత కుటుంబీకులు, గ్రామస్తులు శాంతించారు. మృతుడి కుమారుడు జానీపాషా ఫిర్యాదు మేరకు క్వారీ సూపర్‌వైజర్‌తోపాటు, నిర్వాహకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కనుల పండువగా సందల్..



దర్గాలో ప్రార్థన చేస్తున్న టీపీసీసీ చీఫ్ రేవంత్, తదితరులు



అర్ధరాత్రి బడెఘర్ నుంచి గంధం తీసుకొస్తున్న మత పెద్దలు

- భక్తిశ్రద్ధలతో ఊరేగింపు
- భక్తులతో కిక్కిరిసిన దర్గా పురవీధులు

కాజీపేట రూరల్: కాజీపేట హజరత్ సయ్యద్ షా అఫ్జల్ బియాబానీ దర్గా ఉర్సు ఉత్సవాలు బుధవారం అర్ధరాత్రి ప్రారంభమయ్యాయి. దర్గా పీఠాధిపతి ఖుస్రూపాషా బడెఘర్ నుంచి ప్రత్యేకంగా తయారు చేసిన సందల్ (గంధం)ను ఊరేగింపుగా దర్గాకు తీసుకొచ్చారు. గంధంతో లేపనం చేసి గులాబీ పూల చాదర్‌ను సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం దర్గా ఉత్సవాలు ప్రారంభమైనట్లు ప్రకటించారు. కాగా, ఖుస్రూపాషా గంధంతో ఉన్న వెండి గిన్నెను తలపై పెట్టుకుని దర్గాకు తీసుకువస్తుండగా భక్తులు ఆ గిన్నెను తాకేందుకు పోటీ పడ్డారు. ఈ సందల్ కార్యక్రమంలో దేశ విదేశాల నుంచి భక్తులు, పీఠాధిపతులు, మత పెద్దలు, సూఫీలు పాల్గొన్నారు.

కనుల పండువగా సందల్..

బడెఘర్ నుంచి అర్ధరాత్రి 12 గంటలకు సందల్ తీసుకుని ఊరేగింపుగా అర్ధరాత్రి 2గంటల వరకు దర్గాకు చేరుకున్నారు. ఈ సందర్భంగా డప్పుచప్పుళ్లు, ఫకీర్ల విన్యాసాలు, యువకుల కేరింతలతో దర్గా ప్రాంగణం మార్మోగింది.

దర్గాను దర్శించుకున్న రేవంత్‌రెడ్డి

కాజీపేట దర్గాను టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేతలు వి.హనుమంతరావు, కొండపల్లి దయాసాగర్, రవీందర్ ఉత్తమరావు దళ్వి, షబ్బీర్‌అలీ, అజ్మత్ హుస్సేన్, శోభారాణి, సాంబాని చంద్రశేఖర్, సిరిసిల్ల రాజయ్య, జంగా రాఘవరెడ్డి, కొండా మురళి, సురేఖ, వేం నరేందర్‌రెడ్డి, దొమ్మాటి సాంబయ్య, ఎర్రబెల్లి స్వర్ణ, నమిండ్ల శ్రీనివాస్ దర్శించుకున్నారు. వీరికి దర్గా పీఠాధిపతి ఖుస్రూపాషా స్వాగతం పలికారు. అనంతరం పూలు సమర్పించి ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో భక్తి యార్‌బియాబానీ, ముస్లిం మత పెద్ద షానావాజ్‌బేగ్, నాయకులు మట్టాడ కుమార్, వేణు, పి.శ్రీనివాస్, ఎల్.శ్రీను, అమర్ పాల్గొన్నారు.

దర్గాకు తరలివస్తున్న భక్తులు..

కాజీపేట హజరత్ సయ్యద్ షా అఫ్జల్ బియాబానీ దర్గాకు దేశ నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. భక్తుల కోసం పోలీసులు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. కాజీపేట ఏసీపీ డేవిడ్‌రాజ్, సీఐ సార్ల రాజు, సిబ్బంది.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బందోబస్తు నిర్వహించారు. అదేవిధంగా దర్గా ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపులో మెడికల్ ఆఫీసర్లు జ్యోత్స్న, నవీన, వైద్య సిబ్బంది ఎస్.పద్మ, ఎస్.స్వరూప, ఎ.అశోక్, హెల్త్ అసిస్టెంట్ సురేష్.. భక్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

'విలీనం'పై మాట్లాడే హక్కులేదు



శివనగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ శ్రేణులు

- బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలవి కపట నాటకాలు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

ఖిలా వరంగల్: తెలంగాణ సాయుధ పోరాటానికి వారసులు కమ్యూనిస్టులేనని, తెలంగాణ విలీన దినోత్సవంపై మాట్లాడే హక్కు బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస రావు అన్నారు. ఈనెల 11 నుంచి 17వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా బుధవారం వరంగల్ శివనగర్‌లో సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం తమ్మెర భవన్ నుంచి రామాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రామాలయ కల్యాణ మండపంలో పార్టీ జిల్లా కార్యదర్శి మేకల రవి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. ఈనెల 17న విమోచన దినోత్సవం పేరిట బీజేపీ, జాతీయ సమైక్యతా దినం పేరిట బీఆర్‌ఎస్ పార్టీలు చేపట్టిన కార్యక్రమాలు ప్రజలను మభ్యపెట్టేందుకేనని ఆరోపించారు. సాయుధ పోరాటాన్ని బీజేపీ వక్రీకరిస్తుందని, నైజాంపై పోరాటాన్ని హిందూ, ముస్లింల గొడవగా చిత్రీకరిస్తోందన్నారు. నాటి పోరాటంలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ పాత్ర ఏమాత్రం లేదని, నిజమైన వారసులు కమ్యూనిస్టులేనన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చని బీఆర్‌ఎస్, బీజేపీలకు తెలంగాణ విలీన దినోత్సవంపై మాట్లాడే హక్కు లేదన్నారు. సమావేశంలో పార్టీ నేతలు కర్రె భిక్షపతి, పంజాల రమేష్, జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాష్మియా, పనాస ప్రసాద్, వీరగోని శంకరయ్య, అక్కపెల్లి రమేష్, గన్నారపు రమేష్, బుస్సా రవీందర్, దండు లక్ష్మణ్, గుంపెల్లి మునీశ్వరుడు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీలు..

కాజీపేట అర్బన్ : రిజిస్ట్రేషన్ శాఖలో సీనియర్, జూనియర్ అసిస్టెంట్‌ల బదిలీలకు రంగం సిద్ధమైంది. ఇందుకు గాను రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ ఐజీ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 15 మంది సీనియర్ అసిస్టెంట్‌లు, 85 మంది జూనియర్ అసిస్టెంట్‌లు బదిలీ అయ్యే అవకాశం ఉంది. సీనియర్ అసిస్టెంట్‌లు జోన్ బదిలీల్లో భాగంగా కరీంనగర్, ఖమ్మం బదిలీ అయ్యే అవకాశం ఉండగా, జూనియర్ అసిస్టెంట్‌లు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు బదిలీ అయ్యే అవకాశం ఉంది. కాగా, మంగళవారం ఉత్తర్వులు వెలువడగా, బుధ, గురువారాల్లో పోస్టింగ్ ఇచ్చే అవకాశం ఉంది.